క్లుప్తంగా

తీర గ్రామాల్లో వరద కలవరం



అప్పనపల్లి స్నానఘట్టం వద్ద పరవళ్లు తొక్కుతున్న గోదావరి

మామిడికుదురు: గోదావరి వరద మళ్లీ పెరుగుతుందన్న హెచ్చరికలు తీర గ్రామాల ప్రజల్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఖమ్మం జిల్లా భద్రచలం వద్ద వరద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి ప్రవహిస్తుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. జూలై నెలలో వచ్చిన వరదకు తీర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, పెదపట్నం గ్రామాలతో పాటు పాశర్లపూడి, పాశర్లపూడి లంక ప్రాంతాల్లోని మత్స్యకార ప్రాంతాల ప్రజలు ముంపు సమస్యను ఎదుర్కొన్నారు. మళ్లీ అదే పరిస్థితి వస్తుందన్న భయం తీర గ్రామాల ప్రజల్ని వెన్నాడుతుంది. దీంతో లంక గ్రామాల ప్రజల్లో కలవరం మొదలైంది.

నల్లతాచు హల్‌చల్



నందంపూడిలో పట్టుకున్న నల్లతాచు

అంబాజీపేట: నందంపూడిలో గోసంగి సత్యనారాయణ ఇంటి వద్ద బుధవారం అర్ధరాత్రి సమయంలో నల్లతాచు హల్‌చల్ చేసి భయభ్రాంతులకు గురిచేసింది. సత్యనారాయణ ఇంటి ఆవరణలో ఉన్న కోళ్ల పెట్టెలో నల్లతాచు చేరడంతో భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ వర్మకు సమాచారం ఇచ్చారు. ఘటన ప్రాంతానికి వర్మ చేరుకుని నల్లతాచును బయటకు తీశారు. అప్పటికే ఆ పెట్టెలో ఉన్న కోడి పిల్లను మింగి, కోడి పెట్టను కరవడంతో చనిపోయిందన్నారు. పాము మింగిన కోడి పిల్లను వర్మ బయటకు తీసే సరికి అది చనిపోయింది. నల్లతాచును డబ్బాలో బంధించి జనసంచారం లేని చోట విడిచిపెట్టినట్లు వర్మ తెలిపారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన యల్లమిల్లి వంశీమోహన్, కిరణ్మయి, వరలక్ష్మి కుటుంబ సభ్యులు బుధవారం రూ.10,116 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ ఉద్యోగులకు అందజేశారని ఆలయ ఈఓ సత్యనారాయణ తెలిపారు. దాతకు అర్చకులు ఆశీర్వచనం అందించి, స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.



కొత్తపేట బాలయోగిపేటలో వర్షపునీటిలో నానుతున్న తాటాకిళ్లు



అయినవిల్లి పెదపేటలో ఓ ఇంటిలోకి చేరిన వర్షపు నీరు

అతలాకుతలం

- భారీ వర్షాలతో స్తంభించిన జనజీవనం
- దాదాపుగా ఇళ్లకే పరిమితమైన ప్రజలు

కొత్తపేట: ఎడతెరిపిలేని భారీ వర్షాలకు కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో జనజీవనం స్తంభించింది. మండల కేంద్రాల్లో దుకాణాలు అరకొరగా తెరుచుకున్నాయి. ప్రజలు దాదాపు ఇళ్లకే పరిమితమయ్యారు. బుధవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. జనం బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. జనం ఇళ్లకే పరిమితమయ్యారు. భారీ వర్షాల కారణంగా బుధవారం విద్యాలయాలకు సెలవు ప్రకటించారు. గ్రామాల్లో విష జ్వరాలు బెంబేలెత్తిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నియోజకవర్గాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రధాన రోడ్లు సైతం వర్షం నీటితో కాలువలను తలపిస్తున్నాయి. కొత్తపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని 7 మండలాల్లో సరాసరి 64.3 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది.

మునిగిన రహదారులు, పంటచేలు

అయినవిల్లి: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా బుధవారం తెల్లవారు జాము నుంచి ఏకబిగిన వర్షం కురిసింది. దీంతో మండల ప్రజలు ఇళ్లకే పరిమిత మయ్యారు. మండలంలోని అయినవిల్లి, తొత్తరమూడి, విలస, సిరిపల్లి, వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, పొట్టిలంక, కొండుకుదురు తదితర గ్రామాల్లో పల్లపు కాలనీలు జలమయమయ్యాయి. ఎక్కడ చూసిన మోకాళ్లోతు నీటితో కాలనీలు దర్శనం ఇస్తున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ పూడుక పోవడంతో రోజులు తరబడి ముంపునీటిలోనే జీవనం కొనసాగించాలని, ముంపునీటితో రోగాలు ప్రబలు తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగ మండలంలోని నల్లచెరువు, అయినవిల్లి, నేదునూరు, మడుపల్లి, మాగం తదితర గ్రామాల్లో పంట చేలు నీట మునిగాయి. రహదారుల పైకి వర్షపు నీరు చెరువులను తలపిస్తున్నాయి.

రహదారులను ముంచెత్తిన భారీ వర్షం

మామిడికుదురు: ఎడతెరిపి లేకుండా బుధవారం కురిసిన భారీ వర్షం ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ ప్రాంతాల రోడ్లను ముంచెత్తడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మామిడికుదురు గ్రామంలో 216వ నంబర్ జాతీయ రహదారిపై పలుచోట్ల భారీగా వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. వాహన దారులు తీవ్ర అవస్థలు పడ్డారు. మామిడికుదురు, పాశర్లపూడి, నగరం గ్రామాల్లో జాతీయ రహదారిపై రెండడుగుల మేర వర్షం నీరు నిలిచిపోయింది. మామిడికుదురు ముస్లిం వీధితో పాటు శివాలయం వీధిలోను భారీగా ముంపు నీరు నిలిచిపోయింది. మామిడికుదురు, నగరం గ్రామాల్లో జాతీయ రహదారి నుంచి రెండో వీధికి వచ్చే లింకు రోడ్లపై మూడడుగుల మేర వర్షం నీరు నిలిచిపోవడంతో స్థానికులు ముంపు నీటిలోనే రాకపోకలు సాగించారు. అప్పనపల్లి గ్రామ దేవత మహాలక్ష్మమ్మ ఆలయం, పెదపట్నంలంక అమ్మవారి ఆలయం, శివాలయం వద్ద బీటీ, సీసీ రోడ్లపై వర్షం నీరు నిలిచిపోయింది.

ఎడతెరిపి లేని భారీ వర్షం

అంబాజీపేట: భారీ వర్షానికి అంబాజీపేట మండలం తడిసి ముద్దయింది. భారీ వర్షానికి అంబాజీపేట, మాచవరం, పుల్లేటికుర్రు, ముక్కామల తదితర గ్రామాల్లో జన జీవనం స్తంభించింది, భవన నిర్మాణ కార్మికులు, కూలీలు, చిరు వ్యాపారులు చాలా వరకు ఇంటికే పరిమితమయ్యారు. బుధవారం వారపు సంత కావడంతో కూరగాయాలు, మాంసం వ్యాపారాలు సాగక చిరు వ్యాపారులు, తోపుడుబళ్ల వ్యాపారులు ఉసూరుమన్నారు. ఏకధాటిగా కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. కొబ్బరి తోటల్లో వర్షపు నీరు చేరింది. బస్టాండ్ ప్రాంగణమంతా వర్షపు నీటితో నిండింది. పుల్లేటికుర్రులో బాబా నగర్, వీవర్స్ కాలనీ, పల్లపు వీధి, వాజ్‌పేయి కాలనీ, ఇందిరా నగర్ కాలనీలు వర్షానికి ముంపుబారిన పడ్డాయి. సర్పంచ్ జల్లి బాలరాజు ఆధ్వర్యంలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో ముంపు నీరు తరలించేందుకు చర్యలు తీసుకున్నారు.

చెరువులా మారిన బస్టాండ్

రావులపాలెం: తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురవడంతో స్థానిక బస్టాండ్ వర్షం నీరుతో మునిగి చెరువును తలపిస్తుంది. బుధవారం భారీగా వర్షం కురవడంతో బస్టాండ్ ప్రాంతంలోని బస్సులు ఆగే ప్రాంతం అంతా వర్షపునీరు చేరడంతో బస్టాండ్ ఆవరణ చెరువులా మారింది. దీంతో బస్టాండ్‌లోకి బస్సులు రాకుండా అధికారులు నిలిపివేశారు. అలాగే రెండు ఇంజిన్ల సాయంతో నీటిని లొల్ల హైలెవెల్ చానల్లోకి మళ్లించేందుకు ఏర్పాటు చేశారు. బస్టాండ్ ఆవరణమంతా వర్షపు నీరుతో ముంపుకు గురవడంతో ఆర్టీసీ బస్సులన్నీ బుధవారం స్థానిక జాతీయ రహదారిపైనే ఆగి ప్రయాణికులను ఎక్కించుకోవలసిన పరిస్థితి నెలకొంది.

పి.గన్నవరం: మండలంలో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షంతో పల్లపు ప్రాంతాలు, కాలనీలు జలమయమయ్యాయి. రహదారులు వర్షపునీట మునిగాయి. దీంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

బొట్టుబిళ్లలతో మాజీ రాష్ట్రపతి చిత్రం



స్టాలిన్ రూపొందించిన చిత్రం

మలికిపురం: మండలంలోని గూడపల్లి–గుబ్బలపాలెం గ్రామం వసంత కాలనీకి బి.స్టాలిన్ ఒకటో తరగతి విద్యార్థి బొట్టు బిళ్లలతో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటం రూపొందించాడు. నేడు ఉపాధ్యాయ దినోత్సవం నేపథ్యంలో ఆ విద్యార్థి ముందుగా తాను గీసిన స్కెచ్‌పై రంగురంగుల బొట్టుబిళ్లలను అమర్చి తన అభిరుచిని చాటుకున్నాడు.

పెరిగిన కూరగాయల ధరలు

అంబాజీపేట: కూరగాయల ధరలు గత వారంతో పోలిస్తే పెరిగాయి. సంతమార్కెట్లో ఈ ధరలు స్వల్పంగానే పెరిగినా రిటైల్ మార్కెట్లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. అంబాజీపేటలో బుధవారం జరిగిన వారపు సంతమార్కెట్‌లో గత వారం కూరల ధరలు కేజీ రూ.30లోపే పలకగా ఈ వారం అన్నీ రూ.50 దాటాయి. ఉల్లిపాయలు కేజీ రూ.60, వంకాయలు కేజీ రూ.60, మునగకాడలు రెండు రూ.10, బెండకాయలు కేజీ రూ.60, దొండకాయల కేజీ రూ.40, క్యారెట్ కేజీ రూ.40, బీట్‌రూట్ కేజీ రూ.40, టమాటాలు కేజీ రూ.40, అల్లం కేజీ రూ.80, పచ్చిమిర్చి రూ.50, మామిడికాయ ఒకటి రూ.10, కాకరకాయలు కేజీ రూ.60, అరటికాయలు మూడు రూ.20, క్యాబేజీ రూ.50, చింతపండు కేజీ రూ.120, చిక్కుడుకాయలు కేజీ రూ.90, బంగాళాదుంపలు కేజీ రూ.40. బీరకాయలు కేజీ రూ.60 ఉన్నాయి. మిగిలిన కూరగాయాలు ధరలు సైతం ఆటు ఇటుగా కేజీ రూ.50 నుంచి రూ.60 వరకు ఉన్నాయి. నిమ్మకాయల ధరలు పెద్ద సైజు ఒకటి రూ.3 నుంచి రూ.4కు అమ్ముతున్నారు. ఉల్లి ధరలు ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని మార్కెట్‌లో వ్యాపారస్తులు చెబుతున్నారు.

అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న హిస్టరీ జూనియర్ లెక్చరర్ పోస్టు నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణ ఒక ప్రకటనలో తెలియజేశారు. హిస్టరీ సబ్జెక్ట్‌లో 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల ఆరున ఉదయం పది గంటలకు సంబంధిత ధ్రువ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు జూనియర్ కళాశాల కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల పరిశీలన



ఆదుర్రులో స్లూయిజ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి

మామిడికుదురు: గోదావరి వరద పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అమలాపురం ఆర్డీఓ జి.కేశవ్‌వర్ధన్‌రెడ్డి సూచించారు. ఆయన ఆదుర్రు, గోగన్నమఠం గ్రామాల్లో బుధవారం పర్యటించి ఏటిగట్లను, అవుట్ ఫాల్ స్లూయిజ్‌లను పరిశీలించారు. స్లూయిజ్‌ల వద్ద ఏ విధమైన చెత్త అడ్డు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దెబ్బతిన్న స్లూయిజ్‌ల ఆధునీకరణకు అంచనాలు రూపొందించామని హెడ్ వర్క్స్ జేఈ టీవీఎల్ఎస్ మూర్తి ఆర్డీఓకు వివరించారు. బలహీనంగా ఉన్న పాయింట్లను గుర్తించి అక్కడ ఇసుక బస్తాలను సిద్ధం చేయాలన్నారు. ఆయన వెంట డ్రైన్స్ జేఈ ఆనంద్, ఎమ్మార్వో బి.మృత్యుంజయ రావు, ఆర్ఐ అలీ, వీఆర్వోలు పాల్గొన్నారు.

భారీ వర్షాలు, వరద ఉధృతిపై సమీక్ష



మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ

సఖినేటిపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆదేశాలపై బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పీవీ సత్యనారాయణ ఆయా మండల శాఖల అధికారులతో భారీ వర్షాలు, పెరుగుతున్న వరద ఉధృతిపై సమీక్షించారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై వారితో చర్చించారు. వరద ఉధృతిపై పై నుంచి వచ్చే సమాచారం ఆధారంగా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సత్యనారాయణ కోరారు. డీటీ సీహెచ్ భాస్కర్, ఏవో పీవీ నరసింహారావు, ఎస్ఆర్‌జీఎస్ ఏపీవో నాగప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శిరీష, ఎంఈవో–1 డి.కిషోర్ కుమార్, ఎంఈవో–2 మద్దాలి వెంకటేశ్వరరావు, మెడికల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి



నందంపూడిలో ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరి

అంబాజీపేట: రానున్న రెండు మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో మండల స్థాయి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, ఎంపీడీఓ జి.సరోవర్ అన్నారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో వర్షాలు, వరదలపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీఓలు మాట్లాడుతూ అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేశారన్నారు. భారీ వర్షాలను, తుపానులను, వరదలను ఎదుర్కొనేందుకు అధికారులంతా సిద్ధంగా ఉండాలన్నారు. గోదావరికి వరద వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో తొండవరం, వాకలగరువు, నందంపూడి గ్రామాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వరి, డీటీ లక్ష్మీపద్మ వాకలగరువు, తొండవరం, నందంపూడి గ్రామాల్లో పర్యటించి ముంపు ప్రాంతాలను పరిశీలించారు. సమావేశంలో ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు, ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్, వైద్యాధికారులు వి.గౌమతి, ఎ.ఇంద్రావతి, ఏపీఓ ఏవీ కృష్ణ, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా మట్టి గణపతి ప్రతిమల పంపిణీ



అయినవిల్లిలో భక్తులకు ఉచితంగా గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఆలయ సిబ్బంది

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో మట్టి గణపతి ప్రతిమలు ఆలయ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) ముదునూరి సత్యనారాయణరాజు బుధవారం భక్తులకు ఉచితంగా పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఏసీ మాట్లాడుతూ మట్టిగణపతులు పర్యావరణానికి మేలు చేస్తాయన్నారు. రసాయనాలు, ఆయిల్ పెయింటింగ్‌లతో తయారు చేసిన గణపతి ప్రతిమలు పర్యావరణానికి హాని కలిగిస్తాయన్నారు. భక్తులకు అవగాహన కల్పించడంలో భాగంగా ఆలయం తరపున మట్టిగణపతి ప్రతిమలను అమలాపురానికి చెందిన రాజా ఆర్థోపెడిక్ ఆస్పత్రి వైద్యులు గుర్రం వెంకటశివనాగరాజా ఉచితంగా 1500 మట్టి గణపతి ప్రతిమల పంపిణీకి ఆర్థికంగా సాయం అందజేసినట్లు తెలిపారు. అయితే నేరుగా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని దర్శించిన భక్తులకు మాత్రమే ఆలయంలోనే ఈ ప్రతిమలను ఆలయ సిబ్బంది చేతుల మీదుగా అందిస్తున్నామన్నారు. అలాగని ఇంటి దగ్గరే ఉండి స్వామి ప్రతిమలు ఉచితంగా కావాలంటే అలా పంపిణీ చేసే ప్రసక్తే లేదని ఆలయ ఏసీ తెలిపారు.

ఇమామ్ రజాకు ఘన నివాళి

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం, ఎనిమిదో ప్రవక్త హజరత్ ఇమామ్ రజాకు ముస్లింలు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. మామిడికుదురులోని ఇమామ్ రజా పంజాలో షహదత్ మజ్లిస్ జరిగింది. మత ప్రబోధకుడు అలీ హైదర్ ఆబేదీ మజ్లిస్ ఆలపించారు. సుదూర ప్రాంతాల నుంచి ముస్లింలు కార్యక్రమాలకు హాజరయ్యారు. ఇమామ్ రజాకు ఘనంగా నివాళులర్పించారు. షహదత్‌ను పురస్కరించుకుని ప్రతి ఏడాది సఫర్ మాసంలోని 29వ తేదీని మజ్లిస్ నిర్వహిస్తారు. పంజా ధర్మకర్త సర్కిల్ ఫకర్ సాహెబ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. అనంతరం గురుహే మొహిబ్బానే రజా భక్త బృందం ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పంజా నుంచి నగరంలోని పెద పంజీషా వరకు గుమ్మటాన్ని ఊరేగించి మాతం నిర్వహించారు. గుల్షన్, సాజిద్, జియాల ఆధ్వర్యంలో మాతం జరిగింది. కార్యక్రమాల్లో సంఘం ప్రతినిధులు ఆబేద్ అలీ, కిష్వర్ అబ్బాస్, అన్వర్ తాహిర్ హుస్సేన్, సర్కిల్ ఫర్హత్ అలీబేగ్, సర్కిల్ కల్బే అబ్బాస్, అలందార్ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు బిస్కెట్లు, వాటర్ బాటిళ్లు



వరద బాధితులకు పంపుతున్న బిస్కెట్లు, వాటర్ బాటిళ్ల వ్యాన్ వద్ద జిల్లా సమాఖ్య సభ్యులు, అధికారులు

రావులపాలెం: రాష్ట్ర సెర్ప్ సీఈవో సూచనల మేరకు కోనసీమ జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు, జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో రూ.2 లక్షల విలువైన, 20 వేల బిస్కెట్ ప్యాకెట్లు, 20 వేల వాటర్ బాటిళ్లు (అర లీటర్)ను విజయవాడ వరద సహాయ బాధితులకు బుధవారం పంపించినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ పి.శివశంకరప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను ప్రత్యేక వాహనం ద్వారా రావులపాలెం నుంచి విజయవాడకు పంపినట్లు పీడీ తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



పొట్టిలంకలో కోతకు గురైన నదీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జేసీ నిశాంతి

అయినవిల్లి: గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుందని భద్రాచలంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జేసీ నిశాంతి ఆదేశించారు. జేసీ నిశాంతి బుధవారం మండలంలోని పొట్టిలంకలో పర్యటించారు. వరదకు కోతకు గురవుతున్న ప్రాంతాన్ని ఆమె తహసీల్దార్ సీహెచ్ లక్ష్మమ్మ, ఎంపీడీఓ తాడి వెంకటచార్యలతో కలసి పరిశీలించారు. అలాగే వీరవల్లిపాలెంలో వరద పరిస్థితిని డీఎల్పీవో బొజ్జిరాజు, ఈఓపీఆర్డీ వాణిశ్రీలు పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు గరిమెళ్ల రవి, రామచంద్రరావు, సూర్యనారాయణమూర్తి ఉన్నారు.

చవితి ఉత్సవాలకు దరఖాస్తు చేసుకోవాలి

అయినవిల్లి: చవితి మండపాల ఏర్పాట్లకు సింగిల్ విండో విధానంలో దరఖాస్తు చేసుకొని ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని స్థానిక ఎస్సై కె.మనోహర్‌జోషి తెలిపారు. బుధవారం మండలంలోని సిరిపల్లిలో ఎస్సై కె.మనోహర్ జోషి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. చవితి మండపాల వద్ద ఏ విధమైన సంఘటనలు జరిగిన కమిటీ సభ్యులు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం ముక్తేశ్వరం సెంటర్‌లో ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేశారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమన్నారు.

ఘనంగా గురు పూజోత్సవం



రావులపాలెంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంపీపీ నాగదేవి తదితరులు

రావులపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం మందిరంలో బుధవారం మదర్‌థెరిసా ఆశ్రమం ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకటనాగదేవి, జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావులు ముఖ్య అతిథులుగా హాజరై ఉపాధ్యాయులను సత్కరించి మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దొడ్ల కిషోర్, వీర రాఘవరెడ్డి, ఐఈ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని ధర్మాలకూ మూలం సనాతన ధర్మం



కొత్తపేటలో సనాతన ధర్మం గురించి వివరిస్తున్న మాణిక్య అవధానులు, దత్తాత్రేయ ఘనాపాఠి

కొత్తపేట: అన్ని ధర్మాలకు సనాతన ధర్మమే మూలమని, సనాతన ధర్మం ఉన్నచోట అన్ని ధర్మాలు వర్ధిల్లుతాయని టీటీడీ మాజీ పరీక్ష అధికారి, శ్రీపాద మాణిక్య అవధానులు, గుళ్లపల్లి దత్తాత్రేయ ఘనాపాఠి అన్నారు. శ్రీవీరభద్ర వేదశాస్త్ర విద్వత్సభ 57 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి స్థానిక హరిహర దేవాలయ ప్రాంగణంలో వేద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఘనాపాఠీలు సనాతన ధర్మం ప్రాముఖ్యతను వివరించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి సుమారు 70 మంది ఘనాపాఠీలు పాల్గొని వేదాలు వల్లించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కీర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు దెందులూరి జగదీశ్వరప్రసాద్, ముసునూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శులు కాకరపర్తి బంగారుబాబు, అజ్జరపు వెంకటసత్యనారాయణమూర్తి, తనికెళ్ల వెంకటరామారావు, సభ్యులు పాల్గొన్నారు.

పలువురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు మూర్తి, రఘురామయ్య, నాగలక్ష్మి



మన్నె సత్యనారాయణ



కడలి వెంకట నాగేశ్వరరావు



డీవీవీ రామకృష్ణ

మామిడికుదురు/సఖినేటిపల్లి: మండలంలో ముగ్గురిని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. ముత్యాలపాలెం ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ కడలి వీవీ సత్యనారాయణమూర్తి, గోగన్నమఠం యూపీ స్కూల్ ఇంగ్లిష్ అసిస్టెంట్ గెద్దాడ నాగలక్ష్మి, మగటపల్లి జెడ్పీహెచ్ స్కూల్ అసిస్టెంట్ నయినాల రఘురామయ్యను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారని ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు బుధవారం తెలిపారు. సఖినేటిపల్లి మండలంలోని అంతర్వేదిపాలెం మధ్య గ్రూపు ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా చేస్తున్న కడలి వెంకట నాగేశ్వరరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. అలాగే అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లీష్) మన్నె సత్యనారాయణ కూడా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా రామకృష్ణ

అయినవిల్లి: మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా డీవీవీ రామకృష్ణను మండల పరిషత్ అధికారులు ఎంపిక చేసినట్లు తెలిపారు. డీవీవీ రామకృష్ణ మండలంలోని ఎలకల్లంక ఎంపీయూపీ స్కూల్‌లో ఎస్జీటీగా పని చేస్తున్నారు.

వాసవీ మహిళా క్లబ్ వార్షికోత్సవం

ఆలమూరు: స్థానిక వాసవీ మహిళా క్లబ్ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. వాసవీ వనిత క్వీన్స్ వీ215ఏ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ప్రత్యేక ప్రతిభావంతులను ఘనంగా సత్కరించి మెమెంటోలు బహుకరించారు. వాసవీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.